కుక్కల బెడద నివారణకు చర్యలు

- ఆర్మూర్‌లోని కుక్కలను జిల్లాకేంద్రంలోని ఏబీసీ సెంటర్‌కు తరలిస్తున్న సిబ్బంది
- శునకాల సంతానం పెరగకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల నిర్వహణ



23వ వార్డులో కుక్కలను పట్టుకొని ఏబీసీ సెంటర్‌కు తరలిస్తున్న సిబ్బంది (ఫైల్)



ఆర్మూర్‌లోని బొటి గల్లీలో కుక్కల సమూహం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో ఉదయం వాకింగ్‌కు వెళ్లాలన్నా బయటకు వెళ్లి కిరాణా సామాన్లు తేవాలన్నా కుక్కల భయంతో ప్రజలు ఎక్కడికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈక్రమంలో ప్రజలు పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వీధి కుక్కల బెడద నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా వార్డుల్లోని కుక్కలను సిబ్బంది పట్టుకొని జిల్లాకేంద్రంలోని ఏబీసీ (ఎనిమల్ బర్త్ కంట్రోల్) సెంటర్‌కు తరలిస్తున్నారు. అక్కడ కుక్కల సంతానం పెరగకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు నిర్వహిస్తున్నారు.

నిత్యం పది చొప్పున..

మున్సిపల్ పరిధిలోని 36 వార్డులలోని కుక్కలను ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు జిల్లా కేంద్రంలోని ఏబీసీ సెంటర్‌కు తరలిస్తున్నారు. ఎనిమల్ వెల్ఫేర్ ఏజెన్సీ హైదరబాద్ ఆధ్వర్యంలో ప్రతిరోజు 10 కుక్కల చొప్పును పట్టుకొని జిల్లా కేంద్రంకు తరలిస్తున్నారు. ఒక్కొక్క కుక్కకు రూ. 1650, రవాణ చార్జీ రూ.150 మున్సిపల్ ఆధ్వరంలో చెల్లిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం నుంచి రాత్రి వరకు నల్గొండ జిల్లాకు చెందిన కుక్కల పట్టివేతకు సంబంధించిన సభ్యులు వచ్చి కుక్కలను తరలిస్తున్నారు

ఏబీసీ సెంటర్‌లో కుక్కలకు కుటుంబ నియంత్రణ పరీక్షలు నిర్వహించి ఏడు రోజులు అక్కడే ఉంచి తిరిగి కుక్కలను ఏ వార్డులో పట్టుకున్నారో ఆ వార్డులోనే వదిలేస్తారు. కానీ కుక్కలను ఏబీసీసెంటర్లకు తరలించిన తర్వాత మళ్లీ ఇక్కడ వదిలేయవద్దని పుర ప్రజలు అధికారులకు విన్నవిస్తున్నారు. కానీ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం మాత్రం ఏ వీధిలో తీసుకువెళ్లారో అదే వీధిలోనే వదిలేయాలన్నా అదేశాలు ఉన్నాయని ప్రజలకు సూచిస్తున్నారు.

వారం తర్వాత తీసుకువస్తాం



కుక్కల జనాభా నివారణకై పట్టణంలోని 36 వార్డులలో గల కుక్కలను జిల్లా కేంద్రంలోని ఏబీసీ సెంటర్‌కు తరలిస్తున్నాం. అక్కడ వాటికి కుటుంబ నియంత్రణ పరీక్షలు చేయిస్తున్నాం. అనంతరం వారం రోజుల తర్వాత ఉన్నత అధికారుల అదేశాల మేరకు తిరిగి కుక్కలను వీధుల్లో వదిలేస్తాం.

– రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఆర్మూర్‌లో పరిసరాలను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్



ఆలూర్‌లో వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న అధికారులు

ఆర్మూర్‌టౌన్: ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్ అన్నారు. పట్టణంలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. ఈసందర్భంగా కాలనీలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. దోమల ద్వారా వచ్చే మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికున్ గున్యా లాంటి వ్యాధులకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉండకుండ చూసుకోవాలన్నారు. ఆశా కార్యకర్తలు ప్రతి మంగళ, శుక్రవారం ఇంటింటికీ తిరిగి డ్రైడే కార్యక్రమంపై సీజనల్ వ్యాధులపై ప్రజలకు వివరిస్తున్నారని అన్నారు. సీహెచ్‌వో కృష్ణమూర్తి, సబ్ యూనిట్ ఆఫీసర్ సాయి, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, రాజవ్వ, ఆశలు పద్మ, నరేందర్ పాల్గొన్నారు.

ఆలూర్‌లో..

పెర్కిట్(ఆర్మూర్): ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని దేగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి దినేష్ సూచించారు. ఆలూర్ మండల కేంద్రంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా దినేష్ మాట్లాడుతూ.. ఇంటితో పాటు పరిసరాల్లో నీరు నిలువలు లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం నీటి కుండీలు, కూలర్ల నుంచి నీటిని తొలగించారు. వైద్య సిబ్బంది బ్లేసీ, ఏఎన్‌ఎంలు జమున, రాజగంగు, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల సేవలు మరువలేనివి



బోధన్‌లోని రూరల్ సీఐ కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న పోలీసులు



పెర్కిట్‌లో రక్తదానం చేస్తున్న పోలీసులు

పెర్కిట్(ఆర్మూర్): పోలీసు అమరవీరుల సేవలు మరువలేనివని అడిషనల్ డీసీపీ బస్వా రెడ్డి అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినం సందర్భంగా ఆర్మూర్ సబ్ డివిజనల్ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్తంగా శుక్రవారం పెర్కిట్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి అడిషనల్ డీసీపీ బస్వారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని దానాల కంటే రక్తదానం గొప్పదన్నారు. ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ప్రాణాలు తృణప్రాయంగా అర్పించిన పోలీసు అమర వీరులను స్మరిస్తూ వారం రోజుల పాటు పలు కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం పలువురు రక్తదానం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య అయ్యప్ప శ్రీనివాస్, ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో రవి కుమార్, రూరల సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సైలు, సేవ్ లైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రభాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను, కాంగ్రెస్ నాయకులు చిన్నా రెడ్డి, కొంతం మురళీధర్ పాల్గొన్నారు.

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని రూరల్ సీఐ కార్యాలయంలో శుక్రవారం పోలీసు అమర వీరుల దినం సందర్భంగా అమరులైన పోలీసులకు నివాళులు అర్పించారు. అనంతరం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో పలువురు పోలీసులు, యువకులు రక్తదానం చేశారు. ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. సమాజ భద్రత, శాంతి పరిరక్షణ కోసం కుటుంబాన్ని సైతం లెక్క చేయకుండా ఎల్లవేళలా సమాజ శ్రేయస్సు కోసం పాటుపడే త్యాగధనులు పోలీసులు అన్ని అన్నారు. సీఐ వెంకటనారాయణ, రూరల్ సీఐ విజయ్ బాబు , పట్టణ వ్యాపారులు ప్రదీప్ గుప్తా, పురుషోత్తం, గోపాల్ సిబ్బంది ఉన్నారు.

మైనారిటీ గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలి



రెంజల్‌లోని మైనారిటీ గురుకుల పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న అధికారులు

రెంజల్(బోధన్): జిల్లాలోని మైనారిటీ గురుకుల పాఠశాలలను మైనారిటీలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఆర్సీవో (రీజనల్ కో–ఆర్డినేటర్ అధికారి) అహ్మద్ బషీరుద్దిన్ పేర్కొన్నారు. రెంజల్‌లోని మైనారిటీ గురుకుల పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలు, కళాశాలల్లో ఉన్న ఖాళీ సీట్లను భర్తీ చేస్తామన్నారు. ఆసక్తి కల్గిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునాలని అన్నారు. నాన్ మైనార్టీ సీట్లు పూర్తి స్థాయిలో భర్తీ అయ్యాయని, మైనార్టీ విద్యార్థులకు సంబంధించిన సీట్లు భర్తీ చేయాల్సి ఉందన్నారు. గత మూడు సంవత్సరాలుగా పాఠశాలలో పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంపై ప్రిన్సిపాల్ హర్షియా నాజమ్‌ను అభినందించారు.

క్లుప్తంగా

మహా సభలను జయప్రదం చేయాలి



ఆర్మూర్‌టౌన్: ఈనెల 26, 27న జరిగే సీపీఎం పార్టీ 23వ జిల్లా మహా సభలను విజయవంతం చేయాలని సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యాదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం సీపీఎం 23వ జిల్లా మహాసభకు సంబంధించిన గోడపత్రులను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. సభలో మూడు సంవత్సరాల చేసిన పనిని సమీక్షించుకొని రాబోయే మూడు సంవత్సరాల ప్రణాళిక రూపొందించుకోనున్నట్లు తెలిపారు. నాయకులు భూమన్న, రవి, కుల్దీప్ శర్మ, వేముల రఘు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



ఆర్మూర్‌టౌన్: గర్భస్థ శిశువు మరణానికి కారణమైన ఆర్మూర్ ఏరియా ఆస్పత్రి వైద్యురాలిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం పీడీఎస్‌యూ నాయకులు ఆస్పత్రి అధికారులకు వినతిపత్రం అందజేశారు. బాధిత కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. నాయకులు నిఖిల్, హ్యూమన్‌రైట్స్ జిల్లా అధ్యక్షుడు అనిస్, బాధిత కుటుంబ సభ్యులు గంగాధర్, సంతోష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచాలి



బోధన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను మెరుగుపర్చాలని ఏఐపీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం ఆయన మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం రుచి చూశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెనూ ప్రకారం భోజనం అందించడం లేదన్నారు. నిర్వాహకులకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు దినేష్, రాజు, సాయికిరణ్, శ్రావణ్ ఉన్నారు.

సోయా రైతుల ఆందోళన



రుద్రూర్: పోతంగల్ మండలం హెగ్డోలి గ్రామంలో శుక్రవారం సోయా రైతులు ఆందోళన చేశారు. పోతంగల్ విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ఇటీవల రైతులు సోయాను విక్రయించారు. కొనుగోలు చేసిన సోయాను సారంగపూర్‌కు సంఘ సిబ్బంది పంపించారు. కానీ సోయా మార్క్‌ఫెడ్ నిబంధనల మేరకు లేదని సాకులు చెప్పి సగానికి పైగా వాపస్ పంపించారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్టుబడితో పాటు హమాలి ఖర్చులు తడిసి మోపెడయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి అంక్షలు లేకుండా సోయా తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనట్టయితే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

హైవే విస్తరణ పనుల పరిశీలన



రుద్రూర్: మండలంలో కొనసాగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులను శుక్రవారం ఎన్‌హెచ్ ఆర్‌అండ్‌బీ ఏఈఈ శ్రీధర్‌రావు పరిశీలించారు. రోడ్డు విస్తరణలో నివాస గృహాలు కోల్పోతున్న బాధితులు ప్రభుత్వం ద్వారా ఆదుకోవాలని అధికారులను కోరారు. జాతీయ రహదారి నిర్మాణానికి అందరు సహకరించాలని, ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులకు నష్టపరిహారం అందుతుందని అధికారులు భరోసా కల్పించారు. సిబ్బంది నజీర్, మాజీ ఎంపీటీసీ హబీబ్‌ఖాన్ ఉన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

బోధన్‌రూరల్: సోంపూర్ గ్రామానికి చెందిన దత్తాత్రి కొన్నిరోజుల క్రితం సాలూరలో తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు విచారణ చేపట్టారు. ఫోన్‌ను రికవరీ చేసి శుక్రవారం బాధితుడికి ఎస్సై మచ్చేందర్ రెడ్డి అందచేశారు. కంప్యూటర్ ఆపరేటర్ తోకల లక్ష్మణ్ (కానిస్టేబుల్), సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ఏర్పాటుకు సహకరించాలి



మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లిలో ఆర్వోబీ వద్ద తాత్కాలిక రోడ్డు ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు. గ్రామంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు చివరి దశకు చేరుకున్నాయి. ప్రత్యామ్నాయంగా ఇప్పుడు ఉన్న రోడ్డును కూడ బ్లాక్ చేసి ఆ స్థలంలో కూడ పనులు చేపట్టాల్సి ఉంది. అందుకుగాను పనులు పూర్తయ్యేవరకు మరో రోడ్డును నిర్మించాల్సిన అవసరం రావటం అందుకుగాను నిర్మాణం జరుగుతున్న ఆర్ఓబీకి ఇరువైపుల నివాసపు ఇండ్లు ఉండటం సమస్యగా మారింది. దీంతో శుక్రవారం ఆర్డీవో రాజేంద్రకుమార్, ఆర్టీసీ ఆర్ఎం జాన్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, తహసీల్దార్ శేఖర్, ఎంపీవో శ్రీనివాస్, తదితర అధికారులు అడవి మామిడిపల్లి చేరుకుని ప్రత్యామ్నాయ రోడ్డు విషయమై గ్రామస్తులతో చర్చించారు. పనులు పూర్తికాగానే తాత్కాలిక రోడ్డును తొలిగిస్తామని అధికారులు గ్రామస్తులకు వివరించారు. చర్చల్లో గ్రామ పెద్దలు, గంగాధర్‌గౌడ్, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, అశోక్, గంగోనే సంతోష్, గోవర్ధన్, చింత మల్లారెడ్డిలు ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



మోర్తాడ్: మోర్తాడ్, భీమ్‌గల్ మండల పరిషత్ మాజీ అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు శివలింగు శ్రీనివాస్, కన్నె సురేందర్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం హైదరాబాద్‌లో వారు కాంగ్రెస్‌లో చేరారు. గతంలో ఈ ఇద్దరు నాయకులు కాంగ్రెస్ పార్టీకి చెందినవారే కావడంతో ఇప్పుడు తాము సొంత గూటికి వచ్చామని వెల్లడించారు. నాయకులు తాహెర్ బిన్ హందాన్, బాల్కొండ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

వేతనాలు పెంచి అందించాలి



ఆర్మూర్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో ప్రకారం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంచి, అందించాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు నర్సింగ్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపాల్ స్టాఫ్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆర్మూర్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ మేనేజర్ హయుమ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను సీఎం రేవంత్‌రెడ్డి రెగ్యూలర్ చేయాలని, కార్మికుల విద్య అర్హతను బట్టి ప్రమోషన్ ఇవ్వాలని, కనీస వేతనం రూ. 26వేలు, చనిపోయిన కార్మికులకు రూ. 30వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సకాలంలో చెల్లించాలన్నారు. కార్మిక సంఘం అధ్యక్షుడు బాబురావు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కమ్మర్‌పల్లి: మండలం చౌట్‌పల్లిలో స్థానిక సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ కుంట ప్రతాప్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఐకేపీ ఆధ్వర్యంలో కోనాపూర్, అమీర్‌నగర్, ఇనాయత్ నగర్ తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ చైర్మన్ నర్సయ్య, వైస్ చైర్మన్ బుచ్చన్న ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పాఠశాల మరమ్మతులు పూర్తి చేయించాలి



బోధన్: సాలూర మండల కేంద్రంలోని దళితవాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిలిచిన మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తిచేయించాలని కాలనీవాసులు కోరారు. ఈమేరకు వారు శుక్రవారం మాజీ ఉపసర్పంచ్ సరిడే సాయిలు అధ్వర్యంలో తహసీల్దార్ శశిభూషణ్‌కు వినతిపత్రం అందించారు. పాఠశాలలో మరమ్మతుల పనుల కోసం రూ. 3లక్షల 75వేల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని వారు తెలిపారు. పనులు అర్థంతరంగా నిలిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే పనులను పూర్తి చేయాలని కోరారు. కాలనీవాసులు లాలయ్య, రవి, యాదు, శంకర్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఎండీఎం ఏజెన్సీని మార్చండి



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం(ఎండీఎం) ఏజెన్సీని మార్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. పాఠశాలలో శుక్రవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనంలో పురుగులు, వెంట్రుకలు వస్తున్నాయని, మెనూ ప్రకారం వంట చేయడం లేదని, కొడిగుడ్లు, రాగి జావ పెట్టడం లేదన్నారు. ఇలా తదితర అంశాలను తల్లిదండ్రులు సమావేశంలో తీర్మానం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన ఏజెన్సీని మార్చాలాని తహసీల్దార్ గజనాన్‌కు, మున్సిపల్ కమిషనర్ రాజు, ఎంఈవో రాజగంగారంకు హెచ్‌ఎంకు తీర్మానపత్రం అందజేశారు.

బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు సన్మానం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని వడ్డెర కాలనీలోగల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లనుండటంతో శుక్రవారం వారిని స్థానిక కౌన్సిలర్ సంగీత సన్మానించారు. ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, సంధ్యారాణి, భాగ్యలక్ష్మీల సేవలను కొనియాడారు. హెచ్‌ఎం లక్ష్మణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని హాసకొత్తూర్ మారుతి నగర్ ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు సున్నం శ్రీనివాస్, పొద్దుటూరి చంద్రశేఖర్‌లను గ్రామస్తులు శుక్రవారం సన్మానించారు. ఎంఈవో ఆంధ్రయ్య, ఉపాధ్యాయులు అంజాద్ సుల్తాన్, సంతోష్, శ్రీనివాస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల అందజేత

రుద్రూర్: మండలంలోని రాణంపల్లి గ్రామంలో అమ్మనాన్న ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ వాసు బాబు, సభ్యులు గంగారాం పటేల్, జమీల్ పటేల్ , శంకర్, వెంకన్న, భూమయ్య పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలతో వ్యాపారాలు ప్రారంభించాలి




రెంజల్(బోధన్): బ్యాంకులు అందించే రుణాలతో స్వయం సహాయక సంఘాల సభ్యులు వ్యాపారాలు నిర్వహించాలని ఏపీఎం చిన్నయ్య సూచించారు. మండలంలోని సాటాపూర్ ఎస్‌బీఐ బ్రాంచిలో శుక్రవారం ఆయన సంఘ సభ్యులకు సమావేశం నిర్వహించారు. బ్యాంకు మేనేజర్ శాస్త్రీ, ఫీల్డ్ ఆఫీసర్ నాగేంద్రబాబు, సీసీలు రాజయ్య, సునిత, మండల మహిళా సమాఖ్య అధ్యక్ష్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

స్వామినాథన్ సిఫారసులు అమలు చేయాలి



కమ్మర్‌పల్లి: స్వామినాథన్ కమిషన్ సిఫారసులతో పాలు పంటల మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఈమేరకు కమ్మర్‌పల్లి తహసీల్దార్‌కు వారు వినతిపత్రం అందజేశారు. నాయకులు సారా సురేష్, బాలయ్య, అశోక్, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్లేట్లు, గ్లాసుల అందజేత



రుద్రూర్: కోటగిరిలోని రచ్చగల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఆభయహస్తం సొసైటి, భవాని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనానికి ప్లేట్లు, గ్లాసులు వితరణ చేశారు. దాత దుబాస్ మహేష్‌ను క్లబ్ సభ్యులు అభినందించారు. మధు, రవింద్ర బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కెపాసిటర్ బ్యాంక్ ప్రారంభం



నవీపేట: మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌లో 2ఎంవీఏఆర్ బ్యాంక్ చార్జర్‌ను ట్రాన్స్‌కో ఏడీఈ(కన్‌స్ట్రక్షన్) నిజామాబాద్ తోట రాజశేఖర్ శుక్రవారం ప్రారంభించారు. నవీపేట ఏడీఈ ప్రశాంత్‌రెడ్డి, ఏఈ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కరెంట్ కోత

నవీపేట: మండలంలోని రాంపూర్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌కె ఫారమ్, ఫతేనగర్, విఠలేశ్వర్ తండా, ఫస్ట్ ప్లాట్ గ్రామాలలో మధ్యాహ్నం 3గం.ల నుంచి సాయంత్రం 5గం.ల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని బీఆర్ఎస్ నాయకుడు కటికె శ్రీనివాస్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. అలాగే బీఆర్ఎస్ నాయకుడు సైదు నర్సయ్య భార్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. బాధిత కుటుంబాలను శుక్రవారం బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి పరామర్శించారు. రేగుంట దేవేందర్, నోముల నరేందర్‌రెడ్డి, పూర్ణానందం, సుంకరి మురళి, హారీష్, మహేందర్‌రెడ్డి, బద్దం రాజేశ్వర్ ఉన్నారు.

ఆర్థిక సహాయం అందజేత



వేల్పూర్: మండలంలోని పచ్చల నడ్కుడ గ్రామంలో శంకర్‌గౌడ్ కూతురు సాయి కృప ఇటీవల మృతిచెందింది. బాధిత కుటుంబాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి పరామర్శించారు. రూ. 10వేల ఆర్థిక సహాయం అందజేశారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 –	నరుడు బ్రతుకు నటన-12.45,6.50 పొట్టెన్(తెలుగు)-3.40,9.45
స్క్రీన్-2 –	వెనమ్ ది లాస్ట్ డ్యాన్స్ (తెలుగు-3డీ)-11.15,1.50,4.25, 7.00,9.35
స్క్రీన్-3 –	జనక అయితే గనక(తెలుగు)-1.00 లగ్గం(తెలుగు)-4.00,10.20 వేట్టయన్(తెలుగు)-6.50
స్క్రీన్-4 –	దేవర(పార్ట్-1)--11.35 6.25 విశ్వం(తెలుగు)-3.10 జనక అయితే గనక(తెలుగు)-10.00

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	లగ్గం(తెలుగు)-10.40,4.40 విశ్వం(తెలుగు)-1.30 7.30 వేట్టయన్(తెలుగు)-10.40
స్క్రీన్-2	వెనమ్-ది (తెలుగు-3డీ)-11.00, 1.45,7.35 వెనమ్-ది(ఇంగ్లీష్-3డీ)-4.35, 10.35
స్క్రీన్-3	వేట్టయన్ - 1.35 పొట్టెన్(తెలుగు)-4.40,10.40 దేవర-పార్ట్-1(తెలుగు)-7.35

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	వెనమ్ ది లాస్ట్ డ్యాన్స్ (3డీ తెలుగు)-11.25,2.00 వెనమ్ ది లాస్ట్ డ్యాన్స్ (3డీ ఇంగ్లీష్)-4.35,7.10,9.45
స్క్రీన్-2	నరుడి బ్రతుకు నటన (తెలుగు)-1.05 దేవర(పార్ట్-1)- తెలుగు=4.00 జనక అయితే గనక(తెలుగు)-7.35 విశ్వం (తెలుగు)-10.35
స్క్రీన్-3	జనక అయితే గనక (తెలుగు)- 1.20 7.30 పొట్టేల్(తెలుగు)-4.20 10.25
స్క్రీన్-4	ఎంత పనిచేస్తావ్ చంటి -11.00 లగ్గం(తెలుగు)-1.55 7.50 సముద్రుడు(తెలుగు)-4.45 వేట్టయన్(తెలుగు)-10.40
లలితామహల్	దేవర పార్ట్-1(తెలుగు)
దేవి	పొట్టెన్ (తెలుగు)
నటరాజ్	విశ్వం (తెలుగు)
విజయ్	వెనమ్ (తెలుగు)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	81,200	వెండి (కిలో)	1,02,500
22 క్యారెట్స్	74,925		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800